# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 271 | పేజీలు: 4 | వెల: రూ.4/- | గురువారం 28 మే 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




మహారాష్ట్ర సీఎంకు ముఖ్యమంత్రి

## రేవంత్ రెడ్డి లేఖ

### తుమ్మిడిహట్టిపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్న రేవంత్ రెడ్డి

### చర్చల కోసం సమయమివ్వాలని లేఖలో విజ్ఞప్తి

### ఎఫ్ఆర్ఎల్ పెరిగినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువ ఉంటుందని వెల్లడి

**హైదరాబాద్, మే 27 (నమస్తే ఉదయం)**

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ అంశంపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆ లేఖలో పేర్కొన్నారు. చర్చల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులకు సమయం ఇవ్వాలని, సమావేశానికి తేదీని ఖరారు చేయాలని విజ్ఞప్తి చేశారు.తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్‌కు మహారాష్ట్ర ప్రభుత్వం గతంలో అంగీకరించిందని గుర్తు చేశారు. కానీ దీంతో ఉత్తర తెలంగాణ నీటి అవసరాలు తీరవని పేర్కొన్నారు. ఎఫ్ఆర్ఎల్ పెరిగితేనే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీళ్లు వస్తాయని తెలిపారు. ఎఫ్ఆర్ఎల్ పెంచినా ..మిగతా 2లో

# తెలంగాణలో ఇంటర్ విద్యార్థులకు

# బ్రేక్ ఫాస్ట్ మెనూ ఇదే..

### మెనూలో బోండా, దోశ, పూరీ, మిల్లెట్ ఇడ్లీ, ఉప్మా

### జూన్ 12న బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించనున్న సీఎం

### ఫలహారాలలోకి చట్నీ, సాంబార్, మిక్స్ వెజిటేబుల్ కుర్మా





**హైదరాబాద్, మే 27 (నమస్తే ఉదయం)**

తెలంగాణలో ఇంటర్ విద్యార్థులకు సంబంధించిన బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ ఈ ఏడాది నుంచి అమలు చేయనున్నారు. ఈ బ్రేక్ ఫాస్ట్ విధానానికి సంబంధించిన మెనూ విడుదలైంది. మెనూలో బోండా, దోశ, పూరీ, మిల్లెట్ ఇడ్లీ, ఉప్మా ఉన్నాయి. రోజుకో వంటకాన్ని విద్యార్థులకు ఇవ్వనున్నారు. జూన్ 12న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. విద్యార్థులకు సరైన పోషకాలు అందించేలా మెనూను రూపొందించారు. ఈ ఫలహారాలలోకి చట్నీ, సాంబార్, మిక్స్ వెజిటెబుల్ కుర్మా వంటివి అందించనున్నారు. ఇంటర్ విద్యార్థులకు బలవర్ధక ఆహారాన్ని అందించేందుకు ఈ బ్రేక్ ఫాస్ట్ విధానాన్ని ఈ సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నారు. ఈ పథకం కోసం ప్రతి సంవత్సరం రూ.120 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. బ్రేక్ ఫాస్ట్ పథకం కింద రాష్ట్రంలోని 1.92 లక్షలమంది ఇంటర్ విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయా రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారు. కానీ తెలంగాణలో ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. మధ్యాహ్న భోజనంతో పాటు బ్రేక్ ఫాస్ట్ కూడా ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకోవడంతో, దీనిని ఈ సంవత్సరం నుంచి అమలు చేయనున్నారు.

# అరణ్య ఫామ్‌హౌస్‌కు బండి భగీరథ్‌ను తీసుకువెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్

### బాధితురాలు, ఆమె తల్లి స్టేట్‌మెంట్ ఆధారంగా పోలీసుల దర్యాప్తు

### మొయినాబాద్ మండలంలోని ఫామ్‌హౌస్‌లో సీన్ రీకన్‌స్ట్రక్షన్

### మూడు రోజుల పోలీసు కస్టడీకి కోర్టు అనుమతి



**హైదరాబాద్, మే 27 (నమస్తే ఉదయం)**

పోక్సో కేసులో నిందితుడు బండి భగీరథ్‌ను పేట్‌బషీరాబాద్ పోలీసులు కస్టడీకి తీసుకుని మొయినాబాద్ మండలంలోని అరణ్య ఫామ్‌హౌస్‌కు తీసుకువెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. ఇప్పటికే పోలీసులు బండి భగీరథ్ నలుగురు స్నేహితులను ప్రశ్నించారు. బాధితురాలు, ఆమె తల్లి స్టేట్‌మెంట్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.అరణ్య ఫామ్‌హౌస్‌లో తన కుమార్తెపై అఘాయిత్యం జరిగిందని బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమార్తెను ఒత్తిడి చేసి మద్యం తాగించి, అనంతరం అనుచితంగా ప్రవర్తించినట్టు ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు బండి భగీరథ్‌ను కస్టడీకి తీసుకువెళ్లి, సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. ఈ నెల 16వ తేదీన అరెస్టైన బండి భగీరథ్ ప్రస్తుతం చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. మల్కాజ్‌గిరి కోర్టు మూడు రోజుల కస్టడీకి అనుమతించిన నేపథ్యంలో పోలీసులు ఈరోజు ఉదయం చర్లపల్లి కేంద్ర కారాగారానికి చేరుకుని, అతడిని కస్టడీకి తీసుకున్నారు.

# ప్రక్షాళన రాజ్యాంగబద్ధమే

### విపక్షాల అభ్యంతరాల తిరస్కరణ

### ఈసీకి పూర్తి అధికారాలని స్పష్టీకరణ

### ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై సుప్రీం కీలక తీర్పు

**న్యూఢిల్లీ, మే 27 (నమస్తే ఉదయం)**



ఓటరు జాబితాల సవరణపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెల్లడించింది. ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు సుప్రీంకోర్టు బుధవారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల సంఘం అధికారాలను సమర్థించిన సుప్రీంకోర్టు.. ఆర్టికల్ 324 ప్రకారం ఈసీకి పూర్తి అధికారాలు ఉంటాయని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టులో దీనిపై సుదీర్ఘ విచారణ జరగ్గా.. అనంతరం ఈ తీర్పు వెలువరించింది. దీంతో ఈసీకి ఊరట కలిగినట్లయింది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అనేక రాష్ట్రాలు, పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. దీనిపై సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు ..మిగతా 2లో



## కేరళలో రాజకీయ హైడ్రామా

### మాజీ సీఎం విజయన్ నివాసాల్లో ఈడీ సోదాలు

### ఏక కాలంలో పదికి ప్రాంతాల్లో దాడులు

### కుమార్తె వీణా విజయన్‌కు రూ. 1.72 కోట్లుపై నజర్

### రాజకీయ కక్ష సాధింపేనని సీపీఎం ఆగ్రహం

**న్యూఢిల్లీ, మే 27 (నమస్తే ఉదయం)**

కేరళ రాజకీయాల్లో ప్రస్తుతం హైడ్రామా నడుస్తోంది. మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నేత పినరయి విజయన్ నివాసాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మెరుపు దాడులు నిర్వహించింది. ఈ ఘటనతో తిరువనంతపురంలో ఉద్రిక్తత ..మిగతా 2లో

# కర్ణాటక సీఎంగా డీకే..?

## రాజీనామాకు సిద్ధరామయ్య ఓకే

### నేడు అల్పాహార విందులో కీలక ప్రకటన

### 2023 ఒప్పందం అమలుకు శివకుమార్ పట్టు

### కీలక మంత్రాంగం నడిపిన అధిష్ఠానం

### జాతీయ రాజకీయాల్లోకి సిద్ధరామయ్య..?



**న్యూఢిల్లీ, మే 27 (నమస్తే ఉదయం)**

కర్ణాటక కాంగ్రెస్‌లో నెలకొన్న నాయకత్వ సందిగ్ధత క్లైమాక్స్‌కు చేరుకుంది. గత కొన్ని నెలలుగా సాగుతున్న 'అధికార పోరు'లో భాగంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవి నుంచి తప్పుకోనున్నారనే వార్తలకు పలు పరిణామాలు మద్దతు పలుకుతున్నాయి.. ఈ ఉత్కంఠ భరిత పరిణామాల మధ్య, గురువారం ఉదయం బెంగళూరులోని సీఎం అధికారిక నివాసం 'కావేరి'లో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సిద్ధరామయ్య అల్పాహార విందు ఇవ్వనున్నారు. ఈ భేటీ కర్ణాటక రాజకీయాల్లో అధికార ..మిగతా 2లో



## రూ. 5కే చేపల కూర భోజనం

### 400 క్యాంటీన్లలో బెంగాల్ ప్రభుత్వం అమలు


**న్యూఢిల్లీ, మే 27 (నమస్తే ఉదయం)**

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో చేపల కూర ఎన్నికల సమయంలో హాట్ టాపిక్ అయింది. ఇప్పుడు కూడా చేపలకూరను రాజకీయంగా హైలెట్ అవుతోంది. పశ్చిమ బెంగాల్ సంస్కృతిలో అంతర్భాగమైన ..మిగతా 2లో

# కేరళలో రాజకీయ హైడ్రామా

మొదటి పేజీ తరువాయి...


నెలకొంది. కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ భారీ షాక్ ఇచ్చింది. బుధవారం తెల్లవారుజాము నుంచే తిరువనంతపురంలోని ఆయన అద్దె నివాసం, కన్నూర్‌లోని సొంత ఇల్లు సహా రాష్ట్రవ్యాప్తంగా 10కి పైగా ప్రాంతాల్లో ఈడీ ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలతో ఈ దాడులు జరగడం కేరళ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఈ సోదాలకు ప్రధాన కారణం పినరయి విజయన్ కుమార్తె వీణా విజయన్ నడిపిన ఎక్సలాజిక్ సొల్యూషన్స్ సంస్థకు, సీఎం ఆర్ ఎల్ సంస్థకు మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలు. ఎలాంటి సేవలు అందించకుండానే వీణా సంస్థకు సీఎంఆర్ ఎల్ కు సుమారు రూ. 1.72 కోట్లు చెల్లించిందని ఆదాయపు పన్ను శాఖ మ, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ గతంలోనే నివేదించాయి. దీనిపై మనీ లాండరింగ్ కోణంలో విచారిస్తున్న ఈడీ, తాజాగా విజయన్ , ఆయన అల్లుడు మొహమ్మద్ రియాస్ నివాసాల్లో కీలక పత్రాల కోసం



సోదాలు చేపట్టింది. ఈడీ దాడుల వార్త తెలియగానే తిరువనంతపురంలోని విజయన్ నివాసం వద్దకు భారీగా సీపీఎం కార్యకర్తలు చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. సోదాలు ముగించుకుని బయటకు వస్తున్న ఈడీ అధికారుల వాహనంపై కార్యకర్తలు దాడికి దిగారు. వాహనంపై రాళ్లు, హెల్మెట్లు విసరడంతో కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. పరిస్థితి చేయి దాటకుండా ఉండేందుకు అక్కడ మోహరించిన సీఆర్‌పీఎఫ్ బలగాలు కార్యకర్తలను అదుపు చేసే ప్రయత్నం చేశాయి.

**రాజకీయ కక్షసాధింపే: సీపీఎం**

ఈ దాడులను సీపీఎం తీవ్రంగా ఖండించింది. విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని కేంద్రం తన దర్యాప్తు సంస్థలను ఆయుధాలు గా వాడుకుంటోందని ఆరోపించింది. రాజకీయంగా విజయన్‌ను ఎదుర్కోలేకనే ఇలాంటి దాడులకు దిగుతున్నారని పార్టీ జనరల్ సెక్రటరీ ఎం.ఏ. బేబీ విమర్శించారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ దాడులతో తమకు సంబంధం లేదని, హోం శాఖకు ముందస్తు సమాచారం లేదని స్పష్టం చేసింది. కేరళ హైకోర్టు ఈ కేసులో దర్యాప్తును ఆపలేమని స్పష్టం చేసిన మరుసటి రోజే ఈ దాడులు జరిగాయి. పినరయి విజయన్ , ఆయన కుటుంబ సభ్యులపై వస్తున్న ఈ ఆరోపణలు రాబోయే రాజకీయ పరిణామాలను ఎలా ప్రభావితం చేస్తాయనేది ఇప్పుడు కేరళలో హాట్ టాపిక్. కేంద్ర ఏజెన్సీల దూకుడుతో ఎల్డీఎఫ్ శ్రేణులు ఆందోళనలో ఉండగా, ప్రతిపక్షాలు మాత్రం చట్టం తన పని తాను చేసుకుపోతుందని పేర్కొంటున్నాయి.




## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
# మహిళల అభివృద్ధికి పెద్దపేట

**కైతలాపూర్ లో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను 62 మంది నిరుపేదలకు కేటాయింపు**

**లబ్ధిదారుని ఇంట్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు**

**కూకట్ పల్లి, మే 27 (నమస్తే ఉదయం)**

హైదరాబాద్ విశ్వ నగరంగా రూపొందాలంటే కలుషితంకాని త్రాగునీరు, రహదారులు, విద్యుత్తు, డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని కైతలాపూర్ లో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను 62 మంది నిరుపేదలకు కేటాయించారు. దీనికి సంబంధించిన పట్టాలను బుధవారం మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఇందుకు సంబంధించిన ఓ ఇంటిలో మంత్రి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపేట వేయడం జరుగుతుందని ఇందులో భాగంగానే ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం, పెట్రోల్ బంకుల కేటాయింపు నూతనంగా కొనుగోలు చేసే బస్సులను మహిళా సంఘాలకు కేటాయించి తద్వారా వారు ఆర్థికంగా ఎదిగేందుకు ఎన్నో పథకాలను చేపట్టిందన్నారు. చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమం తీసుకోవడం జరిగిందన్నారు. కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ మాట్లాడుతూ... కూకట్ పల్లి లో నియోజకవర్గంలో ఎక్కువ శాతం నిరుపేదలే ఉన్నారని, వారికి అధిక మొత్తంలో నిధులు కేటాయించాలని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కట్టించాలని మంత్రికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, కలెక్టర్ మను చౌదరి, జోనల్ కమిషనర్, ఎమ్మార్వో, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రక్షాళన రాజ్యాంగబద్ధమే

మొదటి పేజీ తరువాయి...

కూడా దాఖలయ్యాయి. దీనిపై సుప్రీం విచారణ చేపట్టింది. ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ ఏ చట్టాన్ని లేదా రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎస్ ఐ ఆర్ అనేది కచ్చితమైన, సమగ్రమైన ఓటర్ల జాబితా దిశగా ఒక ముందడుగు అని, రాజ్యాంగానికి జీవం పోస్తుందని వ్యాఖ్యానించింది. ఎస్ ఐ ఆర్ ను వినియోగించడం ద్వారా ఎన్నికల సంఘం తన చట్టబద్ధమైన అధికారాలకు వెలుపల వ్యవహరించలేదని తెలిపింది. సాధారణంగా నిర్వహించే దానికి భిన్నంగా ఉన్నందున దీనిని అధికారాలకు అతీతమైనది అని చెప్పలేమంటూ కోర్టు వ్యాఖ్యానించింది. ఎస్ఐఆర్ ద్వారా సాధించాలనుకుంటున్న లక్ష్యానికి, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలనే రాజ్యాంగ లక్ష్యానికి ప్రత్యక్ష సంబంధం ఉందని తాము కూడా సంతృప్తిగా ఉన్నామంది. సుప్రీంకోర్టు ఈ తీర్పుతో ఎస్ఐఆర్ చుట్టూ గత ఏడాదిగా సాగుతున్న వివాదానికి ముగింపు పలికింది.

# రూ. 5కే చేపల కూర భోజనం

మొదటి పేజీ తరువాయి...

చేపను ఇప్పుడు రాజకీయ అస్త్రంగా మార్చుకున్నారు ముఖ్యమంత్రి సువేందు అధికారి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 400 ప్రత్యేక క్యాంటీన్లలో కేవలం రూ.5లకే చేప కూరతో కూడిన భోజనాన్ని అందించనున్నట్లు ఆయన ప్రకటించారు. గతంలో టీఎంసీ ప్రభుత్వం నడిపిన మా క్యాంటీన్ల తరహాలోనే, ఇప్పుడు మరింత ఆకర్షణీయంగా వారానికి రెండు రోజులు చేపలను మెనూలో చేర్చారు. ఎన్నికల ప్రచార సమయంలో బీజేపీ అధికారంలోకి వస్తే బెంగాలీలు చేపలు తినకుండా నిషేధం విధిస్తుంది అంటూ తృణమూల్ కాంగ్రెస్ చేసిన తీవ్ర విమర్శలకు ఈ పథకం ఒక గట్టి కౌంటర్‌గా కనిపిస్తోంది. తాము బెంగాలీ సంస్కృతికి వ్యతిరేకం కాదని, పేదవాడి ఆకలి తీర్చడంలో చేపల కూర భోజనం ఒక భాగమని సువేందు సర్కార్ నిరూపించే ప్రయత్నం చేస్తోంది. కేవలం భోజనమే కాకుండా, మహిళా ఓటర్లను ఆకట్టుకున్న అన్నపూర్ణ భండార్ గతంలో మాతృశక్తి భరోసా పథకం జూన్ 1 నుంచి అమలులోకి రానుంది. దీని కింద అర్హులైన మహిళలకు నెలకు రూ.3,000 చొప్పున నేరుగా వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. గత ప్రభుత్వంలోని లక్ష్మీర్ భండార్ కంటే ఇది రెట్టింపు మొత్తం కావడంతో మహిళల్లో ఈ పథకంపై భారీ అంచనాలు ఉన్నాయి. బడ్జెట్ భోజనంతో పాటు రాష్ట్రంలో విద్యా సంస్థలు, ప్రార్థనా స్థలాల సమీపంలో ఒక కిలోమీటర్ మేర మద్యం విక్రయాలపై ఆంక్షలు విధిస్తూ సీఎం కీలక నిర్ణయం తీసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు నైతిక విలువలకు ప్రాధాన్యం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. సువేందు అధికారి తనదైన మార్కు రాజకీయాలతో బెంగాల్ ప్రజల మనసు గెలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. అప్పుల భారం ఉన్నప్పటికీ, ఇలాంటి భారీ సంక్షేమ పథకాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం చూపుతాయనేది వేచి చూడాలి. అయితే, 'రూ.5 చేపల కూర భోజనం' మాత్రం సామాన్యుడికి పెద్ద ఊరటనిచ్చే అంశమే.

# కర్ణాటక సీఎంగా డీకే..?

మొదటి పేజీ తరువాయి...

మార్పిడికి అధికారిక ముహూర్తంగా భావిస్తున్నారు. మంగళవారం ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠానంతో జరిగిన సుదీర్ఘ చర్చలు రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేలా ఉన్నాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీలతో జరిగిన విడివిడి భేటీల్లో.. సిద్ధరామయ్యకు గౌరవప్రదమైన వీడ్కోలు పలికేందుకు హైకమాండ్ సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆయనకు రాజ్యసభ సీటు ప్రతిపాదించినప్పటికీ, రాష్ట్ర రాజకీయాల్లోనే కొనసాగేందుకు సిద్ధరామయ్య మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. బుధవారం రాత్రి ఢిల్లీ నుంచి బెంగళూరు చేరుకోనున్న డీకే శివకుమార్, నేరుగా రేపు ఉదయం ముఖ్యమంత్రితో భేటీ కానున్నారు. ఈ సమావేశం ముగిసిన వెంటనే సిద్ధరామయ్య తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉంది.

**2023 ఒప్పందం.. డీకే పట్టు**

2023 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య కుదిరిన 'రెండున్నరేళ్ల ఫార్ములా' లేదా అధికార భాగస్వామ్య ఒప్పందాన్ని అమలు చేయాలని డీకే వర్గం మొదటి నుంచీ పట్టుబడుతోంది. కర్ణాటక పీసీసీ అధ్యక్షుడిగా పార్టీని గెలిపించిన తనకు ముఖ్యమంత్రి పీఠం దక్కాల్సిందేనని శివకుమార్ హైకమాండ్ వద్ద తన వాదనను బలంగా వినిపించారు. తాజా పరిణామాలు ఆయనకు సానుకూలంగా మారినట్లు కనిపిస్తోంది. బహిరంగంగా నాయకత్వ మార్పు అంశాన్ని కాంగ్రెస్ నేతలు ఖండిస్తున్నప్పటికీ, అంతర్గతంగా మాత్రం తీవ్రస్థాయిలో కసరత్తు జరుగుతోంది. "ప్రస్తుతానికి మా చర్చలన్నీ రాజ్యసభ, శాసనమండలి ఎన్నికల వ్యూహాల చుట్టూనే సాగాయి. మీడియాలో వస్తున్నవన్నీ ఊహాగానాలే" అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేర్కొన్నప్పటికీ, సిద్ధరామయ్య తన అనుచర మంత్రులతో జరిపిన డిన్నర్ మీటింగ్‌లో పదవి నుంచి తప్పుకుంటానని సంకేతాలివ్వడం గమనార్హం.


## మహారాష్ట్ర సీఎంకు ముఖ్యమంత్రి
# రేవంత్ రెడ్డి లేఖ

మొదటి పేజీ తరువాయి...

మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువగానే ఉంటుందని పేర్కొన్నారు. కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్ గా భేటీ అయ్యారు. అమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రాం కింద తెలంగాణలో టీ-ఫైబర్ ప్రాజెక్టు అమలుపై చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి పలు కీలక అంశాలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి బలమైన హైస్పీడ్ ఇంటర్నెట్ అందించాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. అమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రాం అమలుకు సంబంధిత ఒప్పందాన్ని త్వరితగతిన కుదుర్చుకోవడం, పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదల వేగవంతం తదితర అంశాలపై చర్చించారు. మండలం నుంచి గ్రామ పంచాయతీ రింగ్ నెట్ వర్క్ ఆస్తులను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చేసేందుకు స్పష్టమైన విధానం ఏర్పాటు చేయడంపై వారు చర్చించారు. తెలంగాణ విజ్ఞప్తులపై సింధియా సానుకూలంగా స్పందించారు. కేంద్రం సహకరిస్తుందని హామీ ఇచ్చారు.

# విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 27(నమస్తే ఉదయం):**



విద్యుత్ షాక్ గురై ఎద్దు మృతి చెందిన ఘటన బుధవారం గద్వాల మండలం ఈడ్గోని పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామ స్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కుర్వ లింగన్న ఎద్దులను ఆరుబయట కట్టేశాడు. బుధవారం ఉదయం ఉరుములు మెరుపులకు ఎద్దు బయపడి తాడును తెంపుకుని పరుగెత్తుతున్న క్రమంలో ట్రాన్స్ ఫార్మర్ వద్ద కరెంటు తీగలు తగిలి సంఘటన స్థలంలోనే మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు వ్యవసాయ పనులకు ఉపయోగపడేదని, దీని విలువ సుమారు రూ.80 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఉంటుందని రైతు లింగన్న తెలిపారు. ఒక్కసారిగా ఎద్దు మృతి చెందడంతో తాము తీవ్ర ఆర్థిక నష్టానికి గురయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు.సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించి రైతుకు నష్టపరిహారం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. అలాగే గ్రామాల్లో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# రెవెన్యూ శాఖలో పలువురు బదిలీ
## పలు జిల్లాల్లో తహసిల్దార్లను బదిలీ చేస్తూ ఆదేశాలు

**హైదరాబాద్, మే 27 (నమస్తే ఉదయం)**

ెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖలో ప్రభుత్వం పలువురు అధికారులను బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న 12 మంది తహశీల్దార్లను బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన అధికారులకు తక్షణమే అమల్లోకి వచ్చేలా డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గా కొత్త పోస్టింగులను కేటాయించారు. ఈ బదిలీలకు సంబంధించిన పూర్తి నివేదికను, అధికారులు విధుల్లో చేరిన వివరాలను ప్రభుత్వానికి తక్షణమే సమర్పించాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్ తో పాటు సంబంధిత జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఉత్తర్వుల ప్రకారం బదిలీ అయిన వారిలో నిర్మల్ తహశీల్దార్ మోతీరామ్ ఎ. ను మంచిర్యాల డీఆర్ఓగా, కరీంనగర్‌కు చెందిన బి. రాజేశ్వరిని పెద్దపల్లి డీఆర్ఓగా, పెద్దపల్లికి చెందిన కె.వై. ప్రసాద్‌ను జగిత్యాల డీఆర్ఓగా నియమించారు. అలాగే వనపర్తి నుంచి ఆర్. పాండును నాగర్‌కర్నూల్ డీఆర్ఓగా, ఖమ్మం నుంచి వి. రవికుమార్‌ను ములుగు డీఆర్ఓగా, మేడ్చల్-మల్కాజిగిరి నుంచి జె. స్వామిని కరీంనగర్ డీఆర్ఓగా, నాగర్‌కర్నూల్ నుంచి ఎ. పాండును కామారెడ్డి డీఆర్ఓగా బదిలీ చేశారు. వీరితో పాటు జనగామ తహశీల్దార్ సిహెచ్. శ్రీకాంత్‌ను మహబూబ్‌నగర్ స్పెషల్ కలెక్టర్ పీఏగా నియమించగా, ఎం. సుదర్శన్ రెడ్డి (సూర్యాపేట) ను సిద్దిపేట ఎస్డీసీగా, ఎం. రమాదేవి (ఖమ్మం) ను నల్గొండ ఎస్డీసీగా, జి. కుమారస్వామి (పెద్దపల్లి) ను సిరిసిల్ల ఎస్డీసీగా , ఎన్. వెంకట్ రెడ్డి (కరీంనగర్) ను కరీంనగర్ ఎస్డీసీ (ఎల్ఏ) గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# రణరంగంగా మారిన గాంధీభవన్
## మంత్రుల సమక్షంలోనే నేతల బాహాబాహీ

**హైదరాబాద్, మే 27 (నమస్తే ఉదయం)**

హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ సమావేశంలో ఘర్షణ చోటుచేసుకుంది. గాంధీభవన్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్, విహెచ్, ఎమ్మెల్సీలు బల్యమూరి, అద్దంకి దయాకర్‌ల సమక్షంలోనే నేతలు ఫిరోజ్‌ఖాన్, ఉస్మాన్ అల్ హాజీ బాహాబాహీకి దిగారు. ప్రొటోకాల్ విషయంలో వీరి మధ్య గొడవ జరిగింది. అజహరుద్దీన్ పక్కన కూర్చునే అంశంలో వివాదం చెలరేగింది. ఈ క్రమంలో ఉస్మాన్ అల్ హాజీ నెట్టివేయడంతో ఫిరోజ్‌ఖాన్ కిందపడిపోయారు. ఇద్దరి మధ్య ఘర్షణను అడ్డుకునేందుకు సీనియర్ నేత వీహెచ్ యత్నించారు. ఆయన్ను కూడా నెట్టివేసేలా వ్యవహరించడంతో నేతలు అడ్డుకున్నారు. ఈ పరిణామంతో మంత్రి అజహరుద్దీన్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమావేశం ముగిసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. హైదరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం గాంధీభవన్ సర్ ప్రక్రియపై చర్చించేందుకు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశం తీవ్ర ఉద్రిక్తతకు వేదికైంది. పార్టీ సీనియర్ నేత, మంత్రి మహ్మద్ అజారుద్దీన్ పక్కన కూర్చొనే విషయంలో కాంగ్రెస్ నాయకులు ఫిరోజ్‌ఖాన్, కార్వాన్ ఇన్ చార్జ్ ఉస్మాన్ అల్ హాజీల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. మొదట ఇద్దరి మధ్య మాటల యుద్ధంతో ప్రారంభమైన ఈ గొడవ కాస్తా శృతిమించి ఒకరి చొక్కాలు ఒకరు పట్టుకునే వరకు వెళ్లింది. ఈ క్రమంలోనే ఆగ్రహంతో ఉస్మాన్.. ఫిరోజ్‌ఖాన్‌ను గట్టిగా తోసేయడంతో ఆయన ఒక్కసారిగా కిందపడిపోయారు. గాంధీభవన్ లో సీనియర్ నేతల సమక్షంలోనే ఈ రసాభాస జరగడంతో అక్కడ ఉన్న పార్టీ శ్రేణులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాయి. ఈ గొడవ మరింత పెద్దది కాకుండా ఉండేందుకు అక్కడే ఉన్న సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు (వీహెచ్) వెంటనే జోక్యం చేసుకుని ఇరువర్గాలను అడ్డుకునే



ప్రయత్నం చేశారు. అయితే, ఆవేశంలో ఉన్న నేతలు వీహెచ్‌ను కూడా పక్కకు తోసేసేందుకు ప్రయత్నించడంతో వాతావరణం మరింత వేడెక్కింది. వెంటనే అప్రమత్తమైన మిగతా కాంగ్రెస్ నాయకులు, భద్రతా సిబ్బంది మధ్యలో దూరి ఇరువర్గాలను విడదీయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

# పని ప్రదేశాలలో మహిళలను వేదిస్తే

# చట్ట ప్రకారం శిక్షలు తప్పవు



పని ప్రదేశాలలో మహిళలకు రక్షణ కల్పించాలని కోరుతున్న మహిళలు



మాట్లాడుతున్న డి ఝూన్సీ రెడ్డి

**బుద్వేల్, మే 27 (నమస్తే ఉదయం)**

పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం (పోష్ చట్టం 2013) పై ప్రతి మహిళ అవగాహన కలిగి ఉండటం రాజేంద్రనగర్ లోని శ్రీ వెంకటేశ్వర మహిళా మండలి అధ్యక్షురాలు దుంబాల ఝూన్సీరెడ్డి అన్నారు. పోష్ చట్టం 2013 పై బుధవారం రాజేం ద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మాణిక్యమ్మ కాలనీలోని అంగన్వాడీ కేంద్రాలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, న్యాయవాదులు, డాక్టర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ లోని శ్రీ వెంకటేశ్వర మహిళా మండలి అధ్యక్షురాలు దుంబాల ఝూన్సీరెడ్డి మాట్లాడుతూ, పనిచేస్తున్న ప్రదేశాలలో మహిళల పట్ల ఎవరైన అమర్యాదగా ప్రవర్తిస్తే వెంటనే 181 కు కాల్ చేయాలన్నారు. మహిళలపై లైంగిక వేధిం పులు అరికట్టడానికి ఈ చట్టం పనిచేస్తుందన్నారు. 10 మందికి పైగా ఉద్యోగులు ఉన్న ప్రతి కార్యాలయం ఇంటర్నల్ కమిటీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని చట్టం చెబుతుందన్నారు. ఇంటర్నల్ కమిటీ లు ఏర్పాటు చేయని కార్యాలయాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు కవిత, ఉమారాణి, న్యాయవాది తహక, డాక్టర్ చేతన్, మహిళా నాయకురాళ్లు ఎం లక్ష్మమ్మ, జె లలిత, అంగన్వాడీ టీచర్లు ఎం లక్ష్మీ, ఐ లలిత, ఎం సంగీత, తదితరులు పాల్గొన్నారు.



డీఈ యాదయ్య కు పార్టీ నాయకులతో కలసి వినతి పత్రం అందచేస్తున్న తెలంగాణ ఉద్యమ నాయకులు ఎర్రోళ్ల యాదయ్య

## గగన్ పహాడ్ వీకర్ సెక్షన్ కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టాలి: ఎర్రోళ్ల యాదయ్య

**బుద్వేల్, మే 27 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ డివిజన్ గగన్ పహాడ్ వివేకానంద వీధి వీకర్ సెక్షన్ కాలనీ లో పెండింగ్ లో ఉన్న పనులను త్వరగా చేపట్టాలని కోరుతు తెలంగాణ ఉద్యమ నాయకులు ఎర్రోళ్ల యాదయ్య బుధవారం ఇంజనీరింగ్ విభాగం డీఈ యాదయ్యను కలసి వినతి పత్రం అందజేశారు. సీసీ రోడ్లు వేయాలని, డ్రైనేజీ పైపు లైన్ పనులు చేపట్టాలని, వీధి దీపాలు వెలిగేటట్లు చూడాలన్నారు. పేద ప్రజలు నివసించే గగన్పహడ్ వీకర్ సెక్షన్ కాలనీ ని జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్ విభాగం అధికారులు సందర్శించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. డీఈ ని కలసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు సరికొండ దుర్గేశ్, వీర్లపల్లి నవీన్ కుమార్, వల్లూరి విజయ్ తదితరులు ఉన్నారు.


## ఫోక్సో కేసులో నిందితునికి 20 సంవత్సరాల జైలు శిక్ష

**బుద్వేల్ , మే 27 (నమస్తే ఉదయం)**

రేప్ అండ్ ఫోక్సో కేసులో ఓ వ్యక్తికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 50వేలు జరిమాన విధిస్తు రంగారెడ్డి జిల్లా కోర్టు ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి తీర్పు చెప్పారు. బండ్లగూడ గౌస్నగర్ కు చెందిన సయ్యద్ యూసుఫ్ (46) 2020 లో రేప్ అండ్ ఫోక్సో కేసులో జైలుకు వెళ్లాడు. ఆ కేసు లో సయ్యద్ యూసుఫ్ కు కోర్టు 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.50 వేలు జరిమాన విధించారని రాజేం ద్రనగర్ ఇన్స్పెక్టర్ ముత్తు యాదవ్ తెలిపారు.



సయ్యద్ యూసుఫ్



వి హనుమంతు రావు ను సన్మానించి మొక్కను బహుకరిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

## ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన వి హనుమంతురావును సన్మానించిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్

**బుద్వేల్, మే 27 (నమస్తే ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమం, అభివృద్ధి సలహాదారుగా నియమించిన వి హనుమంతురావు ను బుధవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. బీసీ సంక్షేమ కార్యక్రమలపై వీరిరువురు చర్చించుకున్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం లో పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి మాట్లాడుకున్నారు. బీసీ ల అభ్యున్నతికి హనుమంతురావు అనుభవం ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అన్నారు.



**రాజేంద్రనగర్ లోని భారతీయ వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్) ఇంచార్జి డైరెక్టర్ గా సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం శ్రీనివాస్ ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఐఐఆర్ఆర్ కు నూతన డైరెక్టర్ వచ్చే వరకు ఆ పదవి లో ఆయన కొనసాగుతారు. ఐఐఆర్ఆర్ డైరెక్టర్ గా పనిచేసిన డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం రాజేంద్రనగర్ లోనే ఉన్న మరో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్ ) సంస్థ అయిన నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ (నార్మ్)కు డైరెక్టర్ గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు.**

**- బుద్వేల్, నమస్తే ఉదయం**

## జాతీయ రహదారి-65పై ప్రమాదాల నివారణకు అధికారుల సంయుక్త పరిశీలన

### ఏసీపీ కూకట్‌పల్లి ట్రాఫిక్ కె. వెంకటయ్య

**కూకట్‌పల్లి, మే 27 (నమస్తే ఉదయం)**

జాతీయ రహదారి-65 పరిధిలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్న బ్లాక్ స్పాట్స్‌పై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక పరిశీలన నిర్వహించారు. ఏసీపీ కూకట్‌పల్లి ట్రాఫిక్ కె. వెంకటయ్య ఆధ్వర్యంలో ట్రాఫిక్, మున్సిపల్, రవాణా శాఖల అధికారులు సంయుక్తంగా ప్రమాద ప్రాంతాలను సందర్శించి ప్రమాదాలకు దారితీసే కారణాలను విశ్లేషించారు. ఈ పరిశీలనలో సైబరాబాద్ మున్సిపల్ అధికారులు మౌనిక (డిఈఈ, అల్విన్ సర్కిల్), శ్రావణి (ఏఈఈ, కూకట్‌పల్లి సర్కిల్), రమేష్ (డిఈఈ, మూసాపేట్ సర్కిల్), మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీనుబాబు, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ శేఖర్ రెడ్డి, ఎస్సై రామకృష్ణ, ఆర్టీఏఎం



సెల్‌కు చెందిన పీసీ రాజు, కూకట్‌పల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు. అధికారులు మెట్రో పిల్లర్ నంబర్లు 740 నుంచి 763 వరకు, 824 నుంచి 841 వరకు, అలాగే 874 నుంచి 896 వరకు ఉన్న ప్రమాద ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. రహదారి నిర్మాణ లోపాలు, ట్రాఫిక్ ఒత్తిడి, సిగ్నలింగ్ సమస్యలు, వాహనాల వేగం తదితర అంశాలను సమీక్షించి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు రహదారి భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు బలోపేతం చేయడం వంటి అంశాలపై అధికారులు సూచనలు చేసినట్లు తెలిపారు.

## నార్మ్ డైరెక్టర్‌గా డాక్టర్ ఆర్ ఎం సుందరం బాధ్యతల స్వీకరణ

**బుద్వేల్, మే 27 (నమస్తే ఉదయం):**

రాజేంద్రనగర్ లో గల నేషనల్ అకాడమి ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ (నార్మ్) డైరెక్టర్ గా డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం ఇప్పటి వరకు రాజేంద్రనగర్ లోని భారతీయ వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్) కు డైరెక్టర్ గా పనిచేశారు. నార్మ్ డైరెక్టర్ పదవీ ఖాళీగా ఉండటంతో భారత వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్) డాక్టర్ సుందరం ను నార్మ్ కు డైరెక్టర్ గా నియమించింది. శాస్త్రవేత్తగా, మంచి పరిపాలనాధికారిగా, అందరిని కలుపుకుపోయే వ్యక్తిగా డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం కు పేరుందని ప్రతి ఒక్కరు గుర్తు చేసుకుంటున్నారు. నార్మ్ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం ను నార్మ్, ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు కలసి శుభాకాంక్షలు తెలియజేశారు.



నార్మ్ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న శాస్త్రవేత్తలు



డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం



## భూసమస్యలు పరిష్కరించాలి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

### సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కోరిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్,మే27(నమస్తే ఉదయం)**

భూసమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు.బుధవారం సీఎం క్యాంప్ ఆఫీస్‌లో సీఎం రేవంత్ రెడ్డిని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. శంషాబాద్ మండలంలోని బహదూర్ గూడ,ఘాన్సీమియాగూడ గ్రామాల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూముల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యమంత్రికి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.ఎమ్మెల్యే విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత సానుకూలంగా స్పందించారు.ఈ భూ సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు వీలుగా వెంటనే రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు అవసరమైన ఆదేశాలు జారీ చేశారు.రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ఆధ్వర్యంలో ఈ సమస్యను సమగ్రంగా సమీక్షించి,పూర్తి స్థాయిలో పరిష్కరించాలని అధికారులను సూచించారు.తమ ప్రాంత ప్రజల సమస్యపై తక్షణమే స్పందించి,సానుకూల నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## మంచినీటి సరఫరా కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### ఎండీ అశోక్ రెడ్డి

### వేసవి-బక్రీద్ నేపథ్యంలో జలమండలి అత్యవసర సమీక్ష..

**రాజేంద్రనగర్,మే27(నమస్తే ఉదయం)**




వేసవి తీవ్రతతో పాటు బక్రీద్ పండుగ సందర్భంగా నగర ప్రజలకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు.జేఎండీ మయాంక్ మిట్టల్ తో కలిసి ఉన్నతాధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన పలు కీలక సూచనలు చేశారు.సమీక్ష సమావేశంలో బక్రీద్ పండుగను దృష్ట్యా రాబోయే 48 గంటలు అత్యంత కీలకమని పేర్కొన్న ఎండీ,అన్ని ఓ అండ్ ఎమ్,ట్రాన్స్ మిషన్ అధికారులు సమన్వయంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.నగరంలో ట్యాంకర్ బుకింగ్‌లు అధికంగా నమోదవుతున్న 48 ఫిల్లింగ్ స్టేషన్లలో 24గంటలపాటు నిరంతర ఫిల్లింగ్,డెలివరీ సేవలు కొనసాగించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.ట్యాంకర్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అవసరమైన సిబ్బంది,సాంకేతిక వనరులు అందుబాటులో ఉంచాలని సూచించారు.అలాగే అన్ని ఫిల్లింగ్ స్టేషన్లలో ఫిల్లింగ్,డెలివరీ నిరంతరాయంగా కొనసాగించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.అలాగే బక్రీద్ పండుగ సందర్భంగా కొంతమంది ట్యాంకర్ డ్రైవర్లు విధులకు అందుబాటులో ఉండకపోవచ్చని పేర్కొంటూ,వారి స్థానంలో ప్రత్యామ్నాయ డ్రైవర్లను ముందస్తుగా నియమించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.గాలివాన వల్ల మంజీరా పేజ్-1,2 సిస్టమ్‌లో విద్యుత్ అంతరాయాలు ఏర్పడి పంపింగ్ నిలిచిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని అధికారులు సమావేశంలో వివరించారు.దీనిపై స్పందించిన ఎండీ అశోక్ రెడ్డి,ప్రభావిత ప్రాంతాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ ప్రాంతాల నుంచి నీటిని మళ్లించే చర్యలు చేపట్టాలని సూచించారు.

## ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

**బుద్వేల్, మే 27 (నమస్తే ఉదయం)**

ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్థాపానికి గురైన ఓ యువకుడు తాను ఉంటున్న ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో బుధవారం తెల్లవారు జామున జరిగింది. ఎస్ఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఈ విదంగా ఉన్నాయి... బీహార్ కు చెందిన వికాస్ కుమార్ ( 25) బ్రతుకు దెరువు కోసం వలస వచ్చి కాటేదాన్ శాంతినగర్ లో నివాసం ఉంటున్నాడు. దినసరి కూలిగా పనిచేసుకుంటున్నాడు. వికాస్ కు రెండు సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. ఎనిమిది నెలల వయస్సు గల బాబు ఉన్నాడు. బార్య పిల్లలు బీహార్ లోనే ఉంటారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వికాస్ శాంతినగర్ లో తాను ఉంటున్న ఇంట్లో ప్యాన్ కు లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్యచేరుకున్న చేసుకున్నాడు. సానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న మైలార్దేవుపల్లి పోలీసులు వికాస్ మృ తదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్థం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

## తల్లి మృతిని తట్టుకోలేక ఆటో డ్రైవర్ ఆత్మహత్య

**బుద్వేల్, మే 27 (నమస్తే ఉదయం) :**

మద్యానికి బానిస అయిన ఓ యువకుడు ప్యాన్ కు చీర తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గత సోమవారం మార్కండేయనగర్ కాలనీ లో ఈ సంఘటన జరిగింది. మైలార్దేవుపల్లి పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఈ విదంగా ఉన్నాయి... మార్కండేయనగర్ కు చెందిన ఆటో డ్రైవర్ భరత్ కుమార్ రెడ్డి (27) తల్లి సంవత్సరం క్రితం మరణించింది. అప్పటి నుంచి భరత్ కుమార్ రెడ్డి ఒంటరి జీవితం గడుపుతున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. మానసికంగా కృంగిపోయిన ఆయన గత సోమవారం తన నివాసంలో ప్యాన్ కు చీర తో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకున్న మైలార్దేవుపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కూకట్‌పల్లి డిపోకు 60 ఎలక్ట్రిక్ బస్సులు

## మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఘన ప్రారంభం

## ప్రజా రవాణాలో కొత్త అధ్యాయం.. కాలుష్య రహిత నగర దిశగా కీలక అడుగు



**కూకట్‌పల్లి, మే 27 (నమస్తే ఉదయం)**

హైదరాబాద్ నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత ఆధునికంగా, పర్యావరణ హితంగా తీర్చిదిద్దే దిశగా కూకట్‌పల్లి డిపోకు 60 నూతన ఎలక్ట్రిక్ బస్సులను కేటాయిస్తూ ఘన ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్టీసీ వ్యవస్థలో పలు కీలక సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో ఇప్పటికే 545 ఎలక్ట్రిక్ బస్సులు సేవలందిస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా మరో 2,200 ఈవీ బస్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. హైదరాబాద్ నగర పరిధిలో కొత్త కాలనీలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజా రవాణా వ్యవస్థను కూడా అదే స్థాయిలో విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు సౌకర్యవంతమైన, కాలుష్య రహిత, ఆధునిక రవాణా సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తోందని బండి రమేష్ తెలిపారు. త్వరలోనే పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారి ఆర్థిక భారం తగ్గిందని, కొత్త బస్సుల కొనుగోలు ద్వారా మహిళలను ప్రజా రవాణా వ్యవస్థలో భాగస్వాములుగా నిలబెట్టామని పేర్కొన్నారు. మహిళల భద్రత, సౌకర్యం, భాగస్వామ్యం పెంపు కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. కూకట్‌పల్లి డిపో విస్తరణలో భాగంగా ఐదు ఎకరాల స్థలంలో కొత్త డిపో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చి కూకట్‌పల్లి ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో కాలుష్య రహిత ప్రజా రవాణా కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈవీ బస్సుల ప్రారంభంతో కూకట్‌పల్లి ప్రాంత ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, సురక్షితమైన, పర్యావరణ హితమైన ప్రయాణ సేవలు అందుబాటులోకి రానున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





# తాగునీటి వృథా.. వ్యక్తికి జలమండలి ఫైన్..!

## ఎవరైనా ఇలా చేస్తే చర్యలు తీసుకుంటామని ఎండీ హెచ్చరిక

**హైదరాబాద్, మే27(నమస్తే ఉదయం)**

జలమండలి సరఫరా చేసే తాగునీటిని ఇతర అవసరాలకు వినియోగించిన వ్యక్తికి అధికారులు జరిమానా విధించారు. ఈ ఘటన బంజారా హిల్స్ లో జరిగింది.జలమండలి ఎండీ అశోక్ రెడ్డి బంజారా హిల్స్ ప్రధాన రహదారిపై వెళుతుండగా... రోడ్ నం. 12 లో ఆరెంజ్ ట్రీ ఫర్నిచర్ షాప్ సంబంధించిన వ్యక్తి జలమండలి సరఫరా చేసే నీటితో ప్రాంగణాన్ని కడుగుతూ కనిపించారు.దీంతో ఎండీ ఆగ్రహం వ్యక్తం చేసి.. తాగునీటిని ఇలా ఇతర అవసరాలకు వినియోగించవద్దని హెచ్చరించారు. అంతే కాకుండా అతనికి నోటీసు అందించి, జరిమానా వెయ్యాలని సంబంధిత మేనేజర్ ను ఆదేశించారు. ఎండీ ఆదేశాల మేరకు ఆ వ్యక్తికి రూ.10000 జరిమానా విధించారు.జలమండలి సరఫరా చేసే తాగునీరు ఇలా ఇతర అవసరాలకు వినియోగించద్దని ఎండీ విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఇలాంటి పనులు చేస్తే.. తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.




క్యాశమోని శ్యామ్ రావు ముదిరాజ్ తదితరులను సన్మానిస్తున్న నిర్వాహకులు

# రవీంద్ర భారతిలో తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ అసోసియేషన్ 5వ వార్షికోత్సవాలు

**రవీంద్ర భారతి, మే 27 (నమస్తే ఉదయం) :**

తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్ వెల్ఫేర్ అసోసియేషన్ 5వ వార్షికోత్సవ సంబరాలు రవీంద్ర భారతిలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. వ్యవస్థాపకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మా అసోసియేషన్ సభ్యులందరి సహకారంతో ఇలాంటి విజయాలు సాధిస్తున్నామని వారందరికీ మా సంస్థ తరఫున ఉత్సాహాన్ని కల్పిస్తూ వారు చేసిన కృషికి గాను2026 సంవత్సరానికి ప్రముఖుల చేతుల మీదుగా అ వార్డుల ప్రధానోత్సవం జరగడం చాలా సంతోషంగా ఉందని తెలుపు కొచ్చారు. ఫ్లోర్ లీడర్ బండ ప్రకాష్ చేతుల మీదుగా అవార్డున అందుకున్న కాశమోని శ్యామ్ రావు ముదిరాజ్ (చైర్మన్- డిసిప్లినరీ కమిటీ అండ్ ప్రెసిడెంట్ ముదిరాజ్ కమిటీ, శ్రీ మహా లక్ష్మి మ్యారేజ్ బ్యూరో) మాట్లాడుతూ, శ్రీ మహానంది అవార్డు 2026, గౌతమ బుద్ధ సేవా రత్న అవార్డు 2026 మాకు ఎంతో ఉత్సాహాన్ని కల్పిస్తూ, మరింత చురుకుతనాన్ని ఇవ్వడానికి ఈ అవార్డులు మాకు ప్రోత్సాహాన్ని కలిగించాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బండ ప్రకాష్ , పల్లె లక్ష్మణ్ గౌడ్, దయానంద శర్మ, పన్యాల మమత గౌడ్, గౌడ మహిళా సంఘం అధ్యక్షురాలు అనురాధ, మహిళా ప్రెసిడెంట్ భాగ్యమ్మ, సమస్త ఇన్చార్జి దేశాల ఈశ్వర్ నేత, తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజంతం చేశారు.



# కొండాపురంలో ఘనంగా మారెమ్మ దేవర ఉత్సవాలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 27(నమస్తే ఉదయం):**

కేటిదొడ్డి మండలం కొండాపురం గ్రామంలో జరుగుతున్న మారెమ్మ దేవర ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం మారెమ్మ దేవాలయంలో భక్తులు డప్పు వాయిద్యాల మధ్య, కలశాలతో, పూర్ణ కుంబాలతో ర్యాలీగా తీసుకెళ్లి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పొటేళ్లను బలిదానం చేసి బందు మిత్రులకు మధ్యాహ్నం విందు భోజనాలు ఏర్పాటు చేశారు., మారెమ్మ అవ్వ దేవర సందర్భంగా మారెమ్మ అమ్మను ప్రముఖ సామాజిక కార్యకర్త చుక్క సుదర్శన్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామస్తులకు, రైతులకు పాడిపంటలతో వర్ధిలాలని ఆకాంక్షించారు.





# ఉరుములు మెరుపులతో దద్దరిల్లిన గద్వాల

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 27(నమస్తే ఉదయం)**

బుధవారంతెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో గద్వాల పట్టణం దద్దరిల్లింది. తెల్లవారుజామున నుంచే ఉరుములు మెరుపులతో కూడిన మోస్తారు వర్షం కురియడంతో గద్వాల పట్టణంలోని రోడ్లు అన్నీ జలమయం అయ్యాయి. భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు మోస్తారు వర్షం ఉపశమనం కలిగిచింది. అకాల వర్షాలకు గద్వాల పట్టణంలోని రోడ్లన్నీ జలమయ్యాయి.



# పాదయాత్రగ వెళ్లి పార్చర్ల సవారమ్మ అమ్మవారిని దర్శించుకున్న సంగాల మహిళలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 27(నమస్తే ఉదయం)**

ధరూర్ మండలం పార్చర్ల గ్రామంలో గల శ్రీ సవారమ్మ దేవర ఉత్సవాల్లో భాగంగా బుధవారం గద్వాల మండలం సంగాల గ్రామ నుండి మహిళలు పెద్ద ఎత్తున భోనమెత్తి పాదయాత్రగా బయలుదేరారు. పార్చర్ల సవారమ్మ అమ్మ వారిని దర్శించుకుని, నైవేద్యం సమర్పించనున్నారు. తెల్లవారుజామున నుంచి భారీ వర్షం కురుస్తుండటంతో భక్తులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సుమారు 8కి.మీ నడుచుకుంటు సవారమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకుపాదయాత్రగా బయలు దేరి అమ్మ వారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు.




# పని ప్రదేశాలలో మహిళలకు రక్షణ గురించి అవగాహనా కార్యక్రమం

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 27 (నమస్తే ఉదయం)**

ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ ఉమెన్స్ వీక్ సెలెబ్రేషన్స్ లో భాగంగా బుధవారం గద్వాల్ ఎంపీడీఓ ఆఫీస్ లో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పని ప్రదేశంలో మహిళల రక్షణ గురించి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా సీడీపీఓ ఆకాశ దీప్తి మాట్లాడుతూ... మహిళలపట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించిన లేదా లైంగిక వేధింపులు జరిపించిన అట్టి వేధింపుల పరిష్కారానికి 2013 నుంచి ప్రత్యేక చట్టం అమలులోకి రావడం జరిగిందన్నారు. పని ప్రదేశంలో ఏ మహిళ అయినా వేధింపులకు గురైతే మొదటి నుంచే వ్యతిరేకించాలి అంతే కానీ నాకెందుకులే అనుకుంటే సమస్య పెద్దగా మారే అవకాశం ఉందని తెలిపారు. పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిషేధ చట్టం 2013 ప్రకారం ఏ కార్యాలయం లోనైనా పది మంది సభ్యుల కంటే ఎక్కువగా ఉన్నట్లయితే అయొక్క కార్యాలయంలో ఇంటర్నల్ కమిటీ ని ఏర్పాటు చేసి, ఇంటర్నల్ కమిటీ కి ఛైర్పర్సన్ గా వ్యవహారిస్తారు ఈ కమిటీ ద్వారా ప్రతి పని ప్రదేశం లో ఉద్యోగుల పట్ల షీ బాక్స్ పోర్టల్ అందుబాటులో ఉంటుంది. దీని ద్వారా వేధింపులు ఎదుర్కొంటున్న మహిళలకు పరిష్కార మార్గం సులభతరం అవుతుందన్నారు. బాల్య వివాహ నిషేధ చట్టం 2006 ప్రకారం 18 సంవత్సరాలు నిండని అమ్మాయికి 21 సంవత్సరాలు నిండని అబ్బాయికి వివాహం జరిపించకూడదన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, మొబైల్ ఫోన్ వారి చేతికి ఇచ్చినట్లయితే దాని ద్వారా పిల్లలు చాలా ప్రమాదాలు ఎదుర్కోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ శివలీల, ఇచ్డ్స్ సూపెర్వైసర్లు వెంకటేశ్వరమ్మా, సురేఖ, సునీత, అర్డీఎస్ఎస్జీఓ ధనలక్ష్మి, ఎంపీడీఓ ఆఫీస్ సిబ్బంది, మహిళా సమాఖ్య లీడర్లు మరియు సభ్యులు పాల్గొన్నారు.



# ఘనంగా జిట్టా సునీల్ యాదవ్ జన్మదిన వేడుకలు

## శుభాకాంక్షలు తెలిపిన టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్, పలువురు నాయకులు

**కూకట్‌పల్లి, మే 27 (నమస్తే ఉదయం)**

కైతలాపూర్ డివిజన్ పరిధిలో ని ప్రగతి నగర్ కమ్యూనిటీ హాల్ లో కూకట్ పల్లి నియోజకవర్గం సీనియర్ నాయకులు జిట్టా సునీల్ యాదవ్ జన్మదిన సందర్భంగా కైతలాపూర్ డివిజన్ లో పలు కాలనీ వాసులు, రాజకీయ ప్రముఖులు, స్నేహితులు మధ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, మాజీ కార్పొరేటర్లు పగడాల బాబురావు, కోడిచెర్ల మహేందర్, తూము శ్రావణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు, ఎ బ్లాక్ అధ్యక్షులు పి నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, గుడెప్ నాగారజ్, గాలిబాలాజీ, శేరి సతీష్ రెడ్డి, పుష్ప రెడ్డి, యాదగిరి, తూము మనోజ్ కుమార్, దినేష్, సాధు ప్రతాప్ రెడ్డి, శేఖర్ గౌడ్, రమేష్, కృష్ణ రాజ్ పుత్, ప్రవీణ్, అసిఫ్, సచిన్ తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

## జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బండల వెంకట్రా రాములు

## ఫుట్ బాల్ సమ్మర్ క్యాంప్ డ్రెస్ కిట్ అందజేత

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 27(నమస్తే ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమనాద్రి స్టేడియంలో నిర్వహిస్తున్న ఫుట్ బాల్ సమ్మర్ క్యాంప్ ను బుధవారం తెలంగాణ రాష్ట్ర ఫుట్ బాల్ అసోసియేషన్ సెక్రెటరీ ఫల్గుణ సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు డ్రెస్ కిట్ అందజేశారు. అనంతరం సంతోష్ ట్రోఫీలో ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బండల వెంకట్రా రాములు , జిల్లా అసోసియేషన్ సెక్రెటరీ విజయ్ కుమార్, పాండు, అజయ్,కిషోర్,వినోద్, శివ, నవీన్, మనోజ్, సాయి, విజయ్, తదితరులు ఉన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733